# ఖండకృతి

శ్రీ జాస్తి వేంకట నరసయ్య

UNIVERSITY OF HYDERABAD
LIBRARY

చిలకలూరిపేట
గుంటూరు జిల్లా

సర్వ స్వామ్యములు గ్రంథకర్తవి

ప్రథమ ముద్రణము 1952

University of Hyderabad
LIBRARY
Acc. No. 29289
Dated 11.9.87
Hyderabad-500 134.

నందన సంవత్సరము

. విజయ దశమి .

గాంధి జయంతి

వెల 0-8-0

. భారతీ . ప్రెస్ . తెనాలి .

# వి షయ సూ చి క


| | | పుట | | | పుట |
|---|---|---|---|---|---|
| ప్రార్థన | ... | 5 | గురువు | ... | 22 |
| పుస్తకము | ... | 6 | ఆంధ్రమాత | ... | 23 |
| కవి | ... | 7 | రాష్ట్రము | ... | 24 |
| చిత్రకారుఁడు | ... | 9 | కర్తవ్యము | ... | 25 |
| జనకుఁడు | ... | 10 | కన్నీరు | ... | 26 |
| స్వాగతము | ... | 11 | వయోజనవిద్య | ... | 27 |
| పుష్పవాంఛ | ... | 12 | గ్రంథాలయోద్యమము | | 28 |
| భారత సృష్టి | ... | 13 | కవిసమ్మేళనము | ... | 30 |
| పాదపము | ... | 15 | గాంధిమహాత్ముఁడు | | 30 |
| చిలుక | ... | 15 | బోసువీరుడు | ... | 31 |
| శ్రీకృష్ణాష్టమి | ... | 16 | అది–ఇది | ... | 31 |
| భూతదయ | ... | 17 | ఆకాంక్ష | ... | 34 |
| తెలుఁగుబిడ్డ | ... | 18 | ఆంధ్రప్రభ | ... | 35 |
| ఆసియా | ... | 19 | సేవ | ... | 36 |
| సమత | ... | 20 | భారతనారి | ... | 37 |
| పాఠశాల | ... | 21 | మాతృభూమి | | 38 |

# ఖండకృతి

## ప్రార్థన

వాణీ! మంగళ పుస్తక
పాణీ! నినుఁ గొల్చి కవనపథమున నడుతున్
వీణాశాలిని! మ్రొక్కుదు
రాణింపగఁ జేయుమమ్మ రమణీయ కళన్.

వేటూరి ప్రభాకరునిన్
తేట తెనుఁగు బాస మిసిమిఁ దెలిపినవానిన్
మాటికి మదిలో నెంచుచు
గాట మ్మగు బత్తినతులు కాన్కగ నిడుదున్.

సత్యము శాంతియు దాంతియు
నత్యంత ముదమ్ము ప్రేమ యమల గుణంబుల్
నిత్యము ననుగ్రహించుచు
స్తుత్యముగా భారతాంబ! చూడుము నన్నున్.

# పుస్తకము

సరసమంజుల కథా సల్లాపములతోడ
నొకమాఱు చిత్తమ్ము నూఁపు దీవు
జీవిత చరితముల్ చేదోడుగా నిచ్చి
మహనీయ నీతులన్ మనుతు వీవు
విజ్ఞానదాయక విమలబోధలచేతఁ
బ్రజ్ఞా విశేషముల్ పలుకు దీవు
నవరసమాధురీ నానార్థ కల్పన
నొప్పుచు నానంద మొసఁగు దీవు

విశ్వభూగోళమండలి విషయజాల
మంతయునుగూడ నీయందు నమరి యుండు
సర్వజనముల హితమ నీ సద్వ్రతమ్ము
పూతచారిత్ర నికురుంబ! పుస్తకంబ!

సారాసార వివేకమున్ దెలుపు సచ్చారిత్రసంయుక్తుఁడున్
బారావార గభీరచిత్తుఁ డగుచున్ భాసిల్లు సన్మిత్రమున్
మీఱున్ ధర్మము నొక్కొకప్పు డిఁక; నీ మిత్రత్వ మెల్లప్పుడున్
కారుణ్యంబు నుదారవృత్తిఁ గఱపున్ గల్యాణ మార్గమ్ములన్.

చిత్తము శాంతతన్ విడిచి జీర్ణతనూభవ రోగరాజి నా
యత్తము గాక మానవుఁడు హా!యని దుఃఖము నొందునప్పుడున్
పొత్తమ! నీవ యాతనికిఁ బోవని మిత్రమవై హితమ్ము లా
సత్తిని దెల్పుచుండెదవు సాత్వికవృత్తిని తృప్తి నిచ్చుచున్.

భూతవర్తమానమ్ముల ఖ్యాత పురుష
బోధ లన్నియు నీయందుఁ బొందఁగలము
మూఁడు కాలమ్ములందును ముదము నిచ్చు
సత్య శివసుందర మ్మగు సత్తువీవ.

పోత్తమ మిత్రము బంధువు
పోత్తమ నానార్థదాత బోధకుఁడున్ సం
పత్తియు బత్తియు జననియుఁ
బొత్తమ మనవెలుఁగు, సంతు, పూజ్యహితుండున్.

## * కవి

తెలుఁగు భూమిని నీ పల్కు దివ్యకవిత
సంఘ సంస్కార లాభముల్ చాటి చెప్ప
జాతిగరిమంబె లక్ష్యమై యాతతముగఁ
జేయుచున్నావు సాహితీసేవ సతము.

తేనెలు చిందెడు వాక్కుల
మానిత జాతీయ వస్తుమహనీయ కృతుల్
గానము సేయఁగ నందఱు
ధీనుత! విరచించి తీవు తేజ మ్మెసఁగన్.

---

* 24—10—1951

నవమంజులాలాప నైపుణ్య మొప్పార
గురుహిత కృతులను గూర్చినావు
కరుణరసాన్విత కమనీయ రచనల
నస్పృశ్యతా భావ మణఁచినావు
మాధుర్య సంపూర్ణ మాన్యశైలి నటింప
స్త్రీజాతి దశలఁ జిత్రించినావు
వర్గ వర్ణ ద్వేష వాసనాదూర మా
గుణమె భూషణమంచుఁ గొలిచినావు

నవ్యకావ్య సుమామోద మవ్యయముగ
నేల నాలుగుచెఱఁగుల నింపినావు
అమలజీవన ! సుకవీశ ! ఆంధ్రపుత్ర
అందుకొనుమయ్య నాదు జోహారు లివిగో.

తెలుఁగుల తొంటిపౌరుషము తేకువ జాఱఁగ వ్యర్థరోషముల్
బలసె సమాజ మంతయును బాధలఁ జెందుచునుండె నిచ్చలున్
గలుగదు విద్య తిండియును గష్టము నోర్చెడి పేదవానికిన్
కలమున వీని దిద్ది కృపఁ గాచెడివారు కవీశులే కదా !

ప్రవిమల మ్మగు జాతీయ పథమునందు
మూఁడుకోట్ల తెనుంగులు ముందు నడచి
స్వీయరాష్ట్రమ్ము సాధించి సేవఁ జేయఁ
దనరు నీ కృతు లాచంద్రతారకముగ.

# చిత్రకారుడు

కుంచె చేఁబూని మనమునఁ గొంకు మాని
మధురమధురాతి విజ్ఞానమహిత మైన
యెట్టి చిత్రమ్ము నేనియు నిట్టె వ్రాయు
దహహా! నీ కళాకౌశల మ్మద్భుతమ్ము.

భారతీయ త్యాగపాటవమ్మును దెల్పు
చిత్రమ్ము వ్రాసెదు చెన్నుమీఱ
ప్రకృతి సౌందర్య విభ్రాజిత మ్మైనట్టి
చిత్రమ్ము వ్రాసెదు చెన్నుమీఱ
సాంధ్యరాగచ్ఛటాసదమల మ్మైనట్టి
చిత్రమ్ము వ్రాసెదు చెన్నుమీఱ
నవరసభంగిమ నైపుణ్యమును జాటు
చిత్రమ్ము వ్రాసెదు చెన్నుమీఱ

నెట్టి ఘటనల నేనియుఁ బట్టు విడక
జీవరూపమ్మునం గూర్చి చెలఁగు దీవు
సృష్టికర్తను మఱపించు చిత్రకార!
ఆయురారోగ్య భాగ్యాల నలరు మయ్య!

చిత్రకారుండు కవిశిల్పి సేవఁ జేసి
సత్య శివ సుందరమ్ముగ సంఘమునకు
నూత్నభావాలు వెదచల్లి నొవ్వు లేని
యభ్యుదయమార్గముఁ జూపి యధివసింత్రు.

# * జనకుఁడు

కర్మయోగము లక్ష్యమ్ము నిర్మల మగు
చిత్తమందున నేప్రొద్దుఁ జేర్చినావు
భారతాదుల నవరసభరితముగను
బోధచేసితి బహు సభాపూజ లంది.

మంజుల మకరంద మాధుర్య భరితమౌ
మానసమ్మున మమ్ము మనిపినావు
జీవితాదర్శమ్ముఁ జేర్పింపఁ జాలిన
విద్యలన్ నేర్పితి వేడ్క తనర
ఆత్మప్రబోధమ్ము నశ్రాంతమును దెల్పి
సాంఘిక ధర్మమున్ సలిపి తీవు
తత్త్వవేత్తలలోనఁ దలమానికంబవై
చరియించుచుంటివి సాధువృత్తి

ఆత్మ నిత్య బుద్ధ మ్మని యరసి మదిని
ఘోర రోగ జరాపూర్ణ భూరి కష్ట
ములను బ్రారబ్ధ మంచును మోయుచుంటి
వాది జనకాదులకు సాటి వైతి జనక.

సుందర సత్య శివ మ్మగు
నందఱకున్ మేలు గూర్చు నాతని బ్రతుకే
యొందును జ్ఞానులబోధలఁ
బొందును లాభమ్ము జాతి పుడమిని నెపుడున్.

---

* 1951 జూలై 31 మంగళవారము ఖర నామ సంవత్సర ఆషాఢ బహుళ త్రయోదశి రాత్రి 9 గంటలకు జనకులు 'పౌరాణిక' జాస్తి సుబ్బయ్య గారు పరమపదించిరి.

# స్వాగతము

దీనుల దుఃఖమ్ము దీర్పంగ సమకట్టి
సేవలన్ జలుపు సుశీలురార
అజ్ఞాని జనులకు నక్షరమ్ములు నేర్పి
జ్ఞానమ్ము నిచ్చు సుజ్ఞానులార
కామక్రోధాదులన్ గలఁతఁ జెందనియట్టి
మనసు కల్గిన ధీర మాన్యులార
దేశసౌభాగ్యమే దీక్షగా మది నెంచి
యత్నమ్ము సలిపెడి యమలులార

దయయు సత్యమ్ము వీడని దాతలార
నిత్యకల్యాణపూర్ణ వినితులార
సతత సద్గుణ భూషిత స్వాంతులార
స్వాగతం బయ్య మీ కిదే స్వాగతమ్ము.

పగలు రేయికూడఁ బాయక ధర్మమ్ము
కర్మ వాక్కు మనసు కలసియుండ
దేశభాగ్యవృద్ధి దినదినమ్మునఁగూడఁ
జలుపుచున్న మీకు స్వాగతమ్ము.

జాతీయార్థిక సాంఘికాది సమతా స్వాతంత్ర్య సాహిత్యకృ
ద్రీతుల్ శిల్పకళావిలాసవిలసద్రేఖాది ఘట్టమ్ములన్
ప్రాతర్వంద్య పవిత్ర మానవకథా భాగమ్ములన్ దెల్పుచున్
చేతోమోదముఁ గూర్చువారలు సదా సేవ్యుల్ గదా ధారణిన్.

# పుష్ప వాంఛ

రాజాధిరాజుల రమణీయ కంఠాల
వసియింప మదియందు వాంఛ లేదు
దేవాలయమ్ముల తిమిరమ్ములోపల
వసియింప మదియందు వాంఛ లేదు
కాంచనపూజయే కర్తవ్య మనుచోట
వసియింప మదియందు వాంఛ లేదు
సోమరుల్ కపటంపు జోగు లుండెడిచోట
వసియింప మదియందు వాంఛ లేదు

ద్వేషరాగమ్ము లున్నట్టి దేశమందు
స్వార్థపూరిత మానవ చయమునందు
సమత లేనట్టి విమతుల సంఘమందు
వాసమున్ జేయ మదిలోన వాంఛ లేదు.

జాతికి సేవలన్ జల్పు భక్తుల తల
నివసింప సతతమ్ము నేను దలంతు
విజ్ఞాన పాండితి వెలయించు చోటుల
నివసింప సతతమ్ము నేను దలంతు
ఆర్తులన్ దనుపుచు నామోదములచేత
నివసింప సతతమ్ము నేను దలంతు
కర్మయోగులు పోవు కాలి బాటలయందు
నివసింప సతతమ్ము నేను దలంతు

దేశ గౌరవ సంపత్తి దీక్షతోడఁ
గాచుచుండెడివారల కరములందు
జాతి సాహిత్య సర్వస్వసదనమందు
మాన కెప్పుడు నివసింప నేను దలఁతు.

కోరను యశమును సుఖమును
గోరను రాజ్యంబు నెపుడు గోరను ముక్తిన్
గోరుదు నార్తుల సేవను
గోరుదు నా హృదయమందు క్షోణీహితులన్.

## భారత సృష్టి

ఆసేతు కాశ్మీర మైన భూమిం గల
ప్రజ లెల్లఁ గృషియందుఁ బరిఢవిల్ల
కథియవాడ మొదలు కాకినాడ వఱకు
దేశంబు వృత్తులఁ దేజరిలఁగ
కటకంబు మొదలుగా కాన్పూరునందాఁక
సేవయే వ్రతముగాఁ జెలఁగుచుండ
కచ్చిరాజ్యమునుండి *కామరూపముదాఁక
స్వస్వధర్మంబులు సాగుచుండ
దేశహితకార్యనిరతి సందీప్తి నొసగ
నతులితానంద మంతట నావరింపఁ
బ్రేమవాహిని మనములఁ బెల్లుగాఁగ
నవ్య భారతసృష్టికై నడువు మయ్య.

* అస్సాము

భాషావిభక్తమౌ భారతదేశానఁ
బ్రాంతభాగము లెల్ల బరఁగవలయు
వలసరాజ్యము లెల్లఁ బరపాలనను వీడి
పరిపూర్ణమౌ స్వేచ్ఛ వఱలవలయు
ఏకాధిపత్యంపు ఛాకలు నశియింప
సర్వసామ్యము లెస్స సాగవలయు
సంస్థాన రూపముల్ సమసిపోవఁగ నూత్న
జాతీయతావృద్ధి జరుగవలయు
పురసుఖమ్ములు పల్లెలఁ బొందవలయుఁ
దిండిగింజలు మెండుగాఁ బండవలయు
భిన్న సంస్కృతి మేళన పెరుఁగవలయు
సాంఘికార్థిక సమతయే సలుపవలయు.

మతవైర విరహిత మాన్యప్రజాస్వామ్య
సంపూర్ణరాజ్య సంస్థాపనంబు
కర్షక కార్మిక ఘనబుద్ధి జీవాళి
లసదగణ్యప్రేమ లాలనంబు
దివ్యభాషారాష్ట్ర దీపిత చైతన్య
సముపేత విజ్ఞాన సారకాంతి
సేవాక్రియా సాధుజీవన హృదయస్థ
సంకల్పపోషిత సౌఖ్యరాశి
పొంది భారతవర్షంబు పుడమియందుఁ
గల్గు బానిసదేశాల కష్టములను
దీర్చి విఖ్యాతిచేతను దేజరిల్ల
నవ్యయత్నంబు సేయుఁడో భవ్యులార.

# పాదపము

నీదగు శాఖలన్ వెలయు నీడలయం దతి మోదమందుచున్
స్వాదుఫలమ్ములన్ మెసవి పక్షిగణంబులు సంచరింపఁగా
నాదరమొప్ప వానయును నాతపమున్ సహియించి దీక్షమైఁ
బాదపమా! మదిన్ దలఁతు పావనధర్మము సేవ నెప్పుడున్.

వనముల్ నిండిన గడ్డలోపల సుసంపన్నమ్ములౌ వర్షముల్
ఘనముల్ పిండఁగ మేలిసస్యములు వీఁకన్ బండుచో నెప్పుడున్
జనముల్ పొంగి సమస్త సంపదలచే శాంతిన్ విరాజిల్లుటన్
గనులారం గని సంతసిల్లెదవు లోకశ్రేయమున్ గోరుచున్.

# చిలుక

చిలుకా! యేమిది యాంధ్రభూతలము సుక్షేత్రమ్ములన్ వెల్గియున్
ఫలపూర్ణమ్ములు వృక్షరాజములతో భాసిల్లియున్ దిండికై
పలుకష్టమ్ముల నొందుచున్ నిరత మాపద్వార్ధిలో మున్గుచున్
దొలిప్రాశస్త్యము వీడుచుండె నకటా! తోఁచున్ భయం బెంతయున్.

పంజరబంధమున్ విడచి ప్రబ్బినస్వేచ్ఛను జాతిఁ గూడు నీ
మంజులవర్తనన్ దెలుఁగు మానవసంఘము చూచియున్ బగల్
భంజనసేయకే పరమబాధల నందుచు నుండె నయ్యయో
కుంజమునుండి వీరి కొక కోమలధర్మముఁ దెల్పుమా శుకా.

సంఘవంక్తిని గూర్చుండి సరసమైత్రి
స్వేచ్ఛఫలముల గుడిచెడి శ్రీ శుకమ్మ!
విశ్వమానవజాతికి విమల మైన
సరళమార్గమ్ముఁ జూపుమా స్వాంత మలర..

# శ్రీ కృష్ణాష్టమి

అది యొక మంచి పర్వదిన మాసుదినంబున సర్వజాతి స
మ్మదమున నుట్లు గట్టి బుధమాన్యుని కృష్ణుని మానసమ్మునన్
బాదలిన భక్తితోఁ దలఁచి పూజ లొనర్తురు కార్యసిద్ధికై
"పదపద" మంచుఁ బండుగకు బాలురు బాలికలుత్సహింపఁగాన్.

ఈ రోజే కద కృష్ణుఁడీ పుడమిపై నింపార జన్మించి మున్
కారాగారమునందు మ్రగ్గు జనులన్ గాపాడె గోపాలుఁడై
క్రూరత్వమ్మున మించు దుష్టజనులన్ గూల్చెన్ మహావీరుఁడై
కారుణ్యమ్మున గీత పల్కి జగతీకల్యాణ మాసించుచున్.

ఉట్టిలోపలనున్న వస్తువు నుత్సవమ్మునఁ జూచి తా
మెట్టులైనను దానిఁ బట్టఁగ నెక్కుచుందురు కంబముల్
బట్టు వీడిన భూమిపైఁబడి పల్మరున్ దగ నెక్కుచున్
గట్టి యత్నము సేయుచుందురు కార్యసిద్ధిని గోరుచున్.

# భూతదయ

చలివందిళ్లను బెట్టుటో జనులకున్ సంసేవలన్ జేయుటో
నిలయమ్మందును నిల్పి విద్యల సదా నేర్పార బోధించుటో
కల విజ్ఞానము జాతికిం దెలుపుటో గా కిట్లు వర్తింతురే!
బలులంచున్ సవనంబులంచు నెపుడున్ బ్రాణమ్ములన్ దీయుచున్.

శాకమ్ములు సూపమ్ములు
ప్రాకటముగఁ బెరుఁగుపాలు పరమాన్నమ్ముల్
గైకొని యాఁకలి నణఁపుఁడు
కాకర్మము హింస మాని గాంచుఁడు శుభముల్.

బుద్ధ జీసస్సు గాంధుల బోధ లెంచి
యాత్మ సమదృష్టి వాదమ్ము నరసి మదిని
జీవ హింసను విడనాడి శీఘ్రముగను
నవ్య జాతీయ పథమున నడువుఁ డయ్య.

అయ్యో! ప్రాణులు భీతిలి
కుయ్యో! యని కుందుచుండఁ గూల్చుచు వానిన్
నెయ్యము సర్వము పోవిడి
కయ్యములను బెంచుచుండఁ గల్గునె సుఖముల్!

# తెలుఁగు బిడ్డ

ఆటని శ్రద్ధన్ జదువుము
వీరుఁడవై నిల్వుమయ్య విజ్ఞానమునన్
సార పరీక్షా రణమునఁ
జే రందఁగదయ్య కీర్తి పింపిసలాడన్.

తెనుఁగును జదువుము రక్తిని
దెనుఁగే నీ మాతృభాష తెలియుము దీనిన్
దెనుఁగుఁ దనంబును వీడక
యును వగు వేషంబుతోడ నమరఁగ వలయున్.

మానిత దేశభక్తి నవమంజుల వాక్సుధ శీల సంపదల్
ధీనుత పాండితీగరిమ, ధీరత, కావ్యకళానురక్తియున్
నూనృత వాక్యసిద్ధియును శోభిలఁజేయుచు నీవు నేర్వుమా
ధ్యానముతోడ విద్యల నుదారగుణంబులఁ గార్యసిద్ధికై.

కడఁగి స్వాతంత్ర్యరక్షణ క్రమమునందుఁ
జటులతర శిక్షణాభ్యాస పటిమచేత
సాటి యోధులలోపల మేటి వగుచుఁ
దేజరిల్లుమ దేశానఁ దెలుఁగుబిడ్డ.

# ఆసియా

ఖండము లన్నిట నేష్యా
ఖండంబే మిన్న యగును కరుణాదృష్టిన్
మండన మగు భూమికి నిది
దండి మగలఁ గనుటచేత దాతృతచేతన్.

పూతదయారూపి బుద్ధదేవుం డిట
జన్మించి స్థాపించె సన్మతంబు
ప్రేమావతారుఁడౌ శ్రీ క్రీస్తుపరమర్షి
జన్మించి స్థాపించె సన్మతంబు
మహనీయసంస్కర్త మహమదు త్యాగియు
జన్మించి స్థాపించె సన్మతంబు
కర్మ యోగివరుఁడు గాంధి మహాత్ముండు
జన్మించి స్థాపించె సన్మతంబు

విశ్వమానవజాతికి విమలశాంతి
బోధలిచ్చెను జహ్వారు బుధుఁడు నిచటఁ
దరతరాలకుఁ దఱుగని ధన్యకీర్తిఁ
బొంది భాసించు నాసియా పుడమియందు.

వస్త్ర మన్నంబు గృహమును వైద్యవిద్య
లెల్లవారికిఁ గలుగంగఁ బెల్లుగాను
సామ్య ధర్మంబు లోకాన సౌఖ్య మీయ
నాసియా యత్నమున్ జేయు ననవరతము.

# సమత

ఆర్థిక సమతయె వచ్చిన
స్వార్థమ్ము నశించి ప్రజకు సౌఖ్యము హెచ్చున్
వ్యర్థ మ్మగు భూసంపద
సార్థక్యము నొందఁజేయ సఫలత గలుగున్.

ధనికు లజీర్ణతాదాసులై పడియుండ
బీదలు తిండికై బాధఁ జెంద
సౌధమ్ము లాకాశ సామీప్యమును బొంద
పేదల గుడిసెలు పెరిఁగిపోవ
మోజైన వస్త్రాల మురియఁగాఁ గొందఱు
గోచి గుడ్డయు లేక కొంద ఱేడ్వ
విజ్ఞాను లగువారి వేదిక చెంతనె
యజ్ఞాని దైన్యము లలముకొనఁగ

విప్లవం బేది యావిర్భవించు నొక్కొ
జవము జీవము కలిగి యీ జనమునందె
కటకటా! యెట్టి దుఃఖమ్ము కనఁగనయ్యె
సౌఖ్య మిం కెట్టులుండును సమత లేక?

# పాఠశాల

విద్యార్జనంజేయ విమలదీక్షులతోడఁ
బఱతెంచుచుండిన బాలురార
ఉత్సాహ మేప్రొద్దు నుప్పొంగుచుండంగ
జీవజవము లున్న చిన్నలార
వర్గవర్ణక్రూర వైషమ్యములు లేక
కూర్మితో మెలఁగెడి కుఱ్ఱలార
క్రమశిక్షణమ్మున ఘన మైన వినయాన
వఱలుచుఁ జరియించు వత్సలార

పాఠశాలలో గురువుల పజ్జఁజేరి
విశ్వకళ్యాణగీతికల్ వెలయునటుల
సర్వవిద్యలు నేర్వుఁడు శ్రద్ధతోడ
భావిభారత భాగ్యంపుఁ బారులార.

వీరులు కర్షకుల్ నృపులు విశ్రుతబుద్ధి విరాజితుల్ గుణో
దారులు శిల్పులున్ ప్రథితదాతలు కాంతలు భక్తగాయకుల్
గౌరవపాత్రులౌ కవులు కారణజన్ములు శ్రామికాదులున్
శారదసత్కృపన్ జదివి శాశ్వతకీర్తి గడించి రిచ్చటన్.

శీల విశ్వాసప్రేమముల్ చెలఁగ మధుర
సత్య వినయాది సద్గుణశాల లైన
పాఠశాలలె మన బాల బాలికలను
దీర్చి దిద్దెడు విజ్ఞాన దీపిక లగు.

# గురువు

మంజులబోధచే మధురభావమ్ములు
చిత్తమ్ములోపలఁ జేర్చుచుండు
కార్యశక్తిని బెంచు ఘనుల చరిత్రముల్
తేట తెల్లంబుగాఁ దెలుపుచుండు
విజ్ఞానపూరిత విషయజాల మెల్ల
మనసున కెక్కించు మార్దవమున
బాల్యమ్మునుండియు బాగుగాఁ దెలియంగఁ
గర్తవ్య ధర్మముల్ గఱపుచుండు

పౌరశిక్షణ నిచ్చు సంభావ్యముగను
దేశభాషాభిమానముల్ దేటపఱుచు
భావిజీవిత సౌభాగ్య ఫలము నిచ్చు
కూర్మి బోధించుచుండు సద్గురువరుండు.

సంఘమునయందు మర్యాద సమసిపోయె
లొచ్చు రాబడి ఖర్చులు హెచ్చు లాయె
కట్టఁ దిన లేక కన్నులు లొట్టవోయె
నెట్టి దురవస్థ దేశికా! పట్టె నీకు.

త్రాతవు నీవే విద్యా
దాతవు మఱి నీవ కావె? ధరణీ ప్రజకున్
నేతలు నిన్నే మఱచిరి
పాతక ఘటమెల్ల నిండెఁ బగులక యున్నే?

# ఆంధ్రమాత

అమ్మా! నీదగు బిడ్డలు
కమ్మని స్నేహమ్ము మాని కలహమ్ములతో
నెమ్మనముల నిండించిరి
వమ్ముగ సమయమ్ము పోవ వదలిరి సేవల్.

పచ్చని పంట పొలంబులు
స్వచ్ఛమ్మగు నట్టిభాష వాసి ఘటింపన్
నిచ్చలు కరుణను జూచుచు
మచ్చలు లేనట్టి బ్రతుకు మా కీయఁగదే.

తెలఁగాణభూమిలోఁ దేనెలు చిందెడు
జానుఁ దెనుఁగు బాస జవము నొసఁగ
రాయలసీమలో రత్నమ్ములను బోలు
ధీర కుమారకుల్ తేజ మొసఁగ
సర్కారు తెనుఁగులు జాతీయతను నిల్ప
విశ్వయత్నమ్ముల వెలయుచుండ
రాష్ట్రేతరాంధ్రులు రంజిల్లు మనముల
నీ పదార్చనయందె నిలిపియుంచ

దివ్య విజ్ఞాన రోచిస్సు దిశలనిండఁ
బుత్రికా పుత్రులెల్లరు పూజసేయ
నిత్యకల్యాణ రాశివై నెగడుమమ్మ
అంచితఖ్యాతి సముపేత! యాంధ్రమాత!

గతమునందున్న బాగును గాంచి హృదిని
వర్తమానదినమ్ముల పాత్రతఁ గని
సర్వమానవపరిచర్య సలుపుకొనుచు
ఆంధ్ర సంతతి విజ్ఞత నలరుఁగాత.

## రాష్ట్రము

ట్టినపట్టు వీడకయ పల్మఱు యత్నము సేయుచున్ గడున్
ట్టతనంబునన్ దనదు ధీబల యోగబలమ్ములన్ వ్యథా
ట్టములన్నియున్ గడచి కార్యఫలంబు భగీరథుండు చే
ట్టినయట్టు లాంధ్రులును బాయక రాష్ట్రము పొందఁగావలెన్.

వేంకటశాస్త్రి కవిస్తోమ పూజ్యుండు
తనువు వీడెనటంచుఁ దల్లడిలుచు
పటుకూర్క విసింహ మేగె స్వర్గమ్మంచు
బుచ్చిసుందర కవి పోయెనంచు
వేటూరి జీవమ్ము వీడె నటంచును
కట్టమంచి బుధుండు గిట్టె నంచు
ఆంధ్రుల కలయిక యంతరించె నటంచు
స్వార్థమ్మె యంతట సాగె నంచు
తెలుఁగు సోదరా! చింతింప ఫలమదేమి?
కార్యభారమ్ము వహియింపఁ గదలిరమ్ము
జాతికెల్లను విజ్ఞాన సరణి నేర్పి
నవ్య జాతీయ పథమున నడుపుమయ్య.

UNIVERSITY OF HYDERABAD LIBRARY

పాఁడియుఁ బంటలున్ వివిధ భాసుర శిల్పవిశేష సంపదల్
వాడిగలట్టి ధీరులును బావనవస్తు ఫలాదికంబులున్
గూడ నదీజలమ్ములను గోర్కెలు తీర్చెడి మాతృదేశమున్
బాధువడంగఁజేయుటది పాపపుఁ గృత్యమ యెట్టివానికిన్.

స్వార్థ, మతమౌఢ్య, కులవైర, సంభరితము
దీర్ఘతమ మదె వ్యాపించె దిక్కులందు
విమల సందేశకాంతులు విస్తరిల్ల
ఆంధ్ర జనులను మేల్కొల్పుమయ్య వేగ.

# కర్తవ్యము

కర్తవ్యము మది మఱవక
వర్తనమును దిద్దుకొనుచు బాధిత ప్రజకే
యార్తియు రాని విధమ్మున
వర్తించిననాఁడు కలుగు వసుధకు శుభముల్.

విశ్వమానవ మైత్రి విలసిల్లి పుడమిలో
సంగ్రామ విరమణ జరుగువఱకు
ఆహారమేలేక యాత్మహత్యకుఁ బూను
మానవలోకమున్ మనుచువఱకు
ఆధారమేలేని యనద లందఱుగూడ
విద్యాసమగ్రులై వెలయువఱకు
హింస, కాపట్యాది హేయగుణావళి
మలిన కర్మమ్ములు మాన్పువఱకు

సంఘ సంస్కారమంతట జరుగువఱకు
లలితకళల వికాసంబు కలుగువఱకు
ధర్మరాజ్యమ్ము సర్వత్ర తనరువఱకు
వలదు కర్తవ్య ధర్మముల్ వదల వలదు.

## కన్నీరు

అనదల్ తిండికిఁ గుందుచున్ మిగులనార్తాలాపముల్ సేయుచో
మనసారన్ సుఖియింపనోఁచక జనుల్ మహార్ఘ్యమ్ము సేపట్టుచో
ఘనమౌ దుఃఖమునందు బ్రుంగి విధవల్ కన్నీన్ వెలారించుచోఁ
గనఁగాఁ గన్నులనిండు నీరు మనకీ కష్టమ్ము లెట్లాఱునో.

కుంటి గుడ్డి చెవిటి కుములుచు వెతలతో
దారులలో నిల్చి తల్లడిల్ల
మొండి ముసలి నడ్డి మూల్గుచు రైళ్లలో
మితిలేని రోదనల్ మేళవింప
క్షయ బొల్లి కుష్ఠు సంకర రోగములచేత
బాధితు లెందఱో వలవరింప
ఆధిచే వ్యాధిచే నశ్రాంత మెల్లెడ
శోకంపు వార్తలే ప్రాఁకుచుండ
కంటఁ గన్నీరు గార్చును కఠినుఁడైన
శాంతి యింకెట్టు లుండును స్వాంతమందు?
పూని ప్రభుతయే వీరికిఁ బోషణంబు
సలుప సమకట్టవలయును శ్రద్ధతోడ.

ధనము జనులకున్న దాతృత్వముండదు
దాత లున్నచోట ధనము లేదు
పరగ రెండు నున్నఁ బనిసేయువారలు
త్యాగరతులు గాక యాఁగుఁ బనులు.

## వయోజనవిద్య

ఓటువిలువను గుర్తింపఁ దేటపడఁగ
వయసువచ్చినవారికి నయము మీఱ
విద్యనేర్పుట చదువరి విధి యటంచుఁ
బూని యత్నంబు సలుపుఁడు పూజ్యులార.

పెద్దలు చదువులు నేర్చినఁ
దద్దయు లాభంబుగల్గు ధైర్యము హెచ్చున్
పద్దెము చదువుట వ్రాయుట
యొద్దికతో నేర్వవలయు నొనరఁగ సతమున్.

సేవయె వ్రతముగఁ గైకొని
పావన ధర్మమ్ముతోడఁ బరులకు విద్యల్
త్రోవలు చూపుఁడు మీ మృదు
భావంబులఁ బ్రేమరసము పైకొనుచుండన్.

# గ్రంథాలయోద్యమము

గాడిచర్ల గురుండు గాఢదీక్షాదక్షు
నాయకత్వమ్మున నడుపుచుండ
పాతూరి సేవయే పరమార్థమని యెంచి
కార్యదర్శిగనుండి ఘనతగూర్ప
విజ్ఞులౌ పెద్దలు విశ్వహితార్థులై
దాతృతాగుణమూని దండనుండ
కార్యకర్తలు నిత్య కార్యక్రమంబును
సడలని భక్తితో సలుపుచుండ

విద్య విజ్ఞాన శుభములు వివిధగతుల
సాటి జనులకు నందించు బాటవమున
నాంధ్ర గ్రంథాలయోద్యమం; బతుల శక్తి
పూని సహకార మొసఁగుఁడీ పూజ్యులార.

నూటికిఁ బదిమందియెకద
వాటముగను జదువ వ్రాయవచ్చినవారల్
నేఁటికినైనను జనులకుఁ
బాటుంబడి నేర్పుఁడయ్య పరమార్థంబుల్.

గాలియు నీరమున్ సతతకాంక్షితముల్ గద జీవకోటికీ
కాలమునందు విద్యయును గావలె నట్టుల! సంతత ప్రజా
పాలిత విశ్వభూవలయ పౌరుల హక్కులు రక్షసేయఁగా
జాలమువీడి నేర్పవలె జాతికి దానిని మించు వేడుకన్.

గ్రామ గ్రామమ్మున గ్రంథాలయమ్ములు
విద్యాలయమ్ములు విస్తరిల్ల
భవనంబు లన్నింట వయసు వచ్చినవార
లక్షరాభ్యాసంపు శిక్షనంద
సంస్కృతి రక్షయు సద్గ్రంథ రచనంబు
నిర్మాణ కృషియును నేర్పుమీఱ
మహిళాదిజాతుల మానిత స్వత్వంబు
విజ్ఞానయాత్రలు వెల్లివిరియ

మూఁడుకోట్ల తెలుంగు సైదోడులార!
నవ్య సందేశ ధర్మంబు భవ్యఫణితి
నాచరింపంగఁ జేయుఁడీ యమలులార!
సుజన మార్గంబు వీడని సూరులార!

గతమునందలి మంచిని గణనచేసి
వర్తమానమ్ము భావిని బాత్రతగని
నవ్యసంఘమ్ము నడుపంగ నడుముగట్టి
బాట నిర్మింపవలయును దేటపడఁగ.

# * కవిసమ్మేళనము

జాతికి శుభమున్ గూర్చుచు
ఖ్యాతిని గలిగించునట్టి ఘనుల చరిత్రల్
చేతము లలరఁగ ఛందో
రీతుల లిఖయింప వలయు రేపుఁ మాపున్.

కవితాశక్తిని మీరలు
నవభారతసృష్టిఁ జేయ నైకాధ్వములన్
జవము సుజీవము నింపుచు
నవనవరచనమ్ము లిచ్చి నతులను గొనుఁడీ.

సత్య శివ సుందరమ్మై
యత్యమలంబైన రచన మది యొక్కటియే
నిత్యము యశమున్ గూర్చును
స్తుత్యం బగు మోదమిచ్చు సుజనులు మెచ్చన్.

# మహాత్ముఁడు

ఆతం డెప్పుడు సత్యవాద నిరతుం డావంతయున్ వైరమున్
భూతవ్రాతమునందుఁ బూనని మహాపూర్ణాత్ముఁడౌ సిద్ధుఁడున్
జేతం దమ్మిడి లేని యోగియయి సౌశీల్యమ్ముచే లోకమున్
జాతీయమ్ముగ దిద్ది గాంధి పితయై సల్పెం గదా సేవలన్.

---

**10-4-1950** సూర్యాపేట.

అదియొక సాంధ్యకాలము మహాత్ముఁడు శిష్యులఁగూడి భక్తితోఁ
బదములు మోపుచున్ వడిగఁ బ్రార్థనకేగుచునుండె నత్తఱిన్
బదిలముగాఁగఁ బిస్టలున భర్తియొనర్చిన గుండ్లు వ్రేల్చి దు
ర్మదమునఁ జంపెగాడ్సెయను మానిసి మూర్ఖుఁడు లోకపూజ్యునిన్.

# బోసు వీరుడు

ధీరుం డాతఁడు దేశభక్తుఁడు మహాతీవ్రమ్ముగా యత్నముల్
శూరత్వమ్మునఁ జల్పినాఁడు, జగతిన్ సుశ్లోకుఁడై భారతీ
భారమ్మున్ వదలించె దాస్యతమమున్, భద్రమ్ము నేకూర్పఁగాఁ
గారుణ్యాంబుధి బోసుబాబు మనకై కాంక్షించె స్వాతంత్ర్యమున్.

త్యాగము సేవయున్ వలచి ధారణి సర్వము దేశమాతకై
జోగివలెన్ ద్యజించి వ్రతశుద్ధిని గష్టసహిష్ణు భావమే
యేగతియందునున్ విడక యీప్సితమార సుభాసుచంద్రుఁడా
మూఁగిన దేశవైరులను ముట్టడివేసెను సాహసమ్ముతో.

# అది - ఇది

జననమ్మున్ మరణమ్ము ప్రాణులకిలన్ సాజమ్ములైయుండినన్
ఘనతన్ జాతికి సేవచేసిన దయాకారుల్ క్షమాశీలురున్
మనమం దెప్పుడు స్వార్థమున్ విడచి సన్మార్గమ్మునన్ బోవుచున్
మనినన్ వారలు కీర్తిఁగాంచెదరు సుమ్మా యెల్లకాలంబునన్.

వరదలు భూమికంపములు పైకొని ప్రేలెడి యగ్నిపర్వతాల్
ఖరకిరణాతపమ్ములును గాఢతమస్సులు దీర్ఘరోగముల్
ధరణిఁ బ్రచండయుద్ధములు దారుణనష్టము లగ్గికాల్పులున్
వరుసగ వచ్చుచుండుటకు వర్తిలు కారణమెద్ది మిత్రమా!

మలయమారుతసేవనమ్మున మానసమ్ములు హాయిగా
నలరుచుండఁగ రైతు లెల్లరు నాదరమ్మునఁ జూచుచున్
పొలము పచ్చనిపైరులం బొలుపొందు చెట్లసమూహమున్
బలము మీఱఁగఁ జేయుచుండిరి పాడి దప్పక సేద్యముల్.

అతుల విషాదసంఘటన లన్నియు నంతముఁ జెందుచుండు భూ
వితతకృధాప్రపూర్ణ హృది వేగమె శాంతత నొందుచుండెడిన్
సతతము భోగులై జనులు సౌఖ్యము వీడెద రాతతవ్యథన్
గతమును మార్చి చూపఁగల కాలమహత్త్వము నెన్న శక్యమే!

మనసున శాంతిలేక పలుమార్గములన్ దపియించుచున్నచోఁ
బనివడి పూని దూరమును భార మటంచు దలంప కెంతయున్
గనులకుఁ బండువున్ జలిపి కార్యము పద్ధతి బోధఁ జేయుచున్
జనవున సేమమున్ దెలిపి సల్పుదు మేలును కార్డు మిత్రమా.

కామము క్రోధ మాది యగు కానిగుణమ్ముల నెల్ల వీడియున్
ప్రేమను త్యాగమున్ వలచి పీడిత మానవజాతి సేవకై
నీమములోఁ గృషిన్ సలిపి నీ పతిపావన రక్తధారలన్
భూమిని గార్చినావు బుధ పూజిత! క్రీస్తుమహాత్మ! తెంపునన్.

కొందఱు భోగభాగ్యములకున్ సరదార్లయి కుల్కుచుండఁగాఁ
గొందఱు కూడుగుడ్డలకుఁ గుందుచునుందురు దైన్యరాసులై
కొందఱు నొక్క రూపమున హర్షమునొందుచుఁ గానిపింప రీ
వందమ దేల కల్గెనను శంకకు నుత్తర మెవ్వఁడిచ్చునో ?

ధనికుల్ కొందఱు సంతతిన్ బడయ కాత్మన్ లెస్స దుఃఖింపగాఁ
బెను సంతానము నీద లేక వగతోఁ బేదల్ విలాపింత్రు సా
మ్మున కేలోపము లేనివారు చదువన్ బోరార ! విద్యారతుల్
ఘన దారిద్ర్యముచేత నాఁగెదరు లోకంబెంత చిత్రం బహో!

ప్రాతఃకాలము లేచుచున్ బరిమిత వ్యాయామమున్ జేయుచున్
జేతఃప్రీతిగఁ బుస్తకాధ్యయనమున్ శ్రమించు లేఖ్యాదులన్
జాతీయమ్మగు వక్తృతామననముల్ స్వానంద మారోగ్యమే
రీతిన్ వీడక సర్వవృద్ధికొఱకై రేలుంబవల్ పూనుమా.

భేదము వీసమేనియును విశ్వజనావళియందుఁ జూప కా
హ్లాదముతోడ నెల్లప్రజ నాయయి వేళల సేకరించుచున్
వాదము బాధలున్ తనువు వాంఛలు పూర్తిగఁ బాపి శాంతి సం
పాదిత సౌఖ్యమున్ నిలిపి వాసిగడింతువు రుద్రభూమిరో.

భారతభూమిలో బహువిధ ధాన్యాల
నొదవించు రైతుకు "మొదటి సీటు"
నవ్యవస్తూత్పత్తి భవ్యమ్ముగాఁ జేయు
మేటి కార్మికునకు సీటు రెండు

బుద్ధిజీవి ప్రజావృద్ధి గోర్వానికి
సాటివారలు మెచ్చ సీటు మూఁడు
విశ్వ కళాకార శాశ్వత హితముకై
న్యాయయుక్తమ్ముగా నాల్వసీటు

కలుగునట్లుగ యత్నమ్ము సలిపి నీవు
"రైతు కార్మిక" జనరాజ్య రాష్ట్రములను
స్థాపనమ్మును జేసి యీ జగతియందు
యశము పొందుము సోదరా! దిశలు నిండ.

# ఆకాంక్ష

మతమేదైనను మానవుల్ పుడమిపై మాన్యానురాగమ్ములన్
సతతమ్మున్ వసియించుచున్ గడప సచ్ఛాంతమ్ముతోఁ గాలమున్
వెతలన్ బాయుచు సర్వదేశములు వేవేగన్ స్వతంత్రమ్ములై
గతకీర్తుల్ గడియించినిర్భయములై కామ్యార్థముల్ పొందుతన్

హక్కులు బాధ్యతల్ విధులు నంతటఁ దప్పక చెల్లఁగావలెన్
గ్రక్కున బంజరుల్ కృషిని గామిత ధాన్యము లీయఁగావలెన్
ఎక్కువ తక్కువల్ విడచి యేకసమాజము చేయఁగావలెన్
నిక్కుచు నిల్గుచున్ మనెడి నీచపులేమిని బావఁగా వలెన్.

# ఆంధ్రప్రభ

జాతీయతాపూర్ణ సముదార భాష్యముల్
జనులకు మితిలేని జాగృతి నిడ
నవ్యవార్తావళి సవ్యమార్గంబున
బీదల కష్టముల్ వెల్లడింప
సంపాదకీయము సరసంపు రచనతో
విజ్ఞానకాంతుల వెలుఁగు నీయ
వ్యాసపీఠమ్ము కావ్యముల నిగ్గులు తేల్చి
పాండితీ సంపత్తి పంచిపెట్ట

జాతి విజ్ఞానమార్గముల్ చక్క దిద్ది
తెలుఁగురాష్ట్ర నిర్మాణంబు కలుగునట్లు
చెలఁగి యాంధ్రప్రభా! తెల్గుసీమలందు
విపుల సంచారబోధల వెలయు మమ్మ.

# సేవ

సేవయె మానవధర్మము
సేవయె హృదయమ్ము మార్చు, చింతల నణచున్
సేవయె భారత లక్ష్యము
సేవయె మన కనుఁగుఁదోడు చింతామణియున్.

ఆశింపక ఫల మించుక
పాశవిక గుణాలి విడచి పరహితమునకై
కోశము కాలము విద్యను
దేశము మెచ్చంగ నిచ్చు ధీరులు ధన్యుల్.

సేవ జీవితసందేశ భావ మిచ్చు
సేవ ద్వేషమ్ము హరియించుఁ జిత్తమందు
సేవ యైక్యమ్ముఁ గూర్చును శీఘ్రగతిని
సేవ ప్రజలకుఁ జేయని చేఁత గలదె?

# భారత నారి

రణముల్ చేసిరి సత్యభామ మొదలౌ రాజీవనేత్రల్ ధృతిన్
దణలాత్రేయియు గార్గియున్ జదివిరాశాస్త్రార్థముల్ భక్తితోఁ
బణమందున్ మనసాధ్వులేఘనముగాఁ బ్రాశస్త్యమున్ గాంచినా
రణుమాత్రమ్మును సందియమ్మువల దాయాస్త్రీచరిత్రమ్ములన్.

మానిత మాధురీ భరిత మంజుల శిల్పకళావిశేషమున్
గాన సుధాప్రపూర్ణ కలకంఠవిరాజిత వాక్చమత్కృతిన్
ధ్యానవిలీన మానస పథాంచిత భక్తిగుణానురక్తియున్
బూనుచు మానినీమణులు పోలుదురెందును బూరుషాళితోన్.

పావనసేవలన్ బ్రజకు వాంఛిత బోధల నందఁ జేయుచో
దేవత యంద్రు స్త్రీని ధర దివ్యకలాన్విత విజ్ఞులందఱున్
బ్రోవ సమర్థలై మనలఁ బూర్వ నవీన విశేష విద్యలన్
భావపరంపరన్ వెలుఁగు భామినులందఱు పూజనీయలే.

# మాతృభూమి

ఆంధ్ర తమిళముల్ మైసూరు హైద్రబాదు
కేరళ మొరిస్స కూర్గు బీహారు ఢిల్లి
త్రిపుర భోపాలు మణిపూరు పెపుసు కచ్చి
మధ్యమోత్తర వింధ్య హిమాచల ప్ర
దేశ భాగముల్ బొంబాయి తేజరిల్ల
పశ్చిమంబైన బెంగాలు పరఁగుచుండ
మధ్యభారత మస్సాము మహిమ చూప
వినుత పాంచాల మజ్మీరు వెలుఁగు లీన
నగ్గలించి రాజస్థాన మలరుచుండ
సార సౌరాష్ట్ర భూమి యశస్సునింప
జమ్ము కాశ్మీరములు మైత్రి చాటుచుండ
పాటియాల విలాసపూర్ నీటుగుల్క
నండమాను నికోబారు గండుమీఱ
భరత భూమాత లోకానఁబరఁగుఁగాత.

• భారతీ • ప్రెస్ • తెనాలి • 1952 •

UNIVERSITY OF HYDERABAD
S. N. Reddy
LIBRARY

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

Cl. No. 81 Acc. No. 29289
USSK
DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.